స్కెచ్

# టీకప్పులో తుఫాను

అవసరాల రామకృష్ణారావు

'చెల్లీ, యీ తాళాలు పట్టుకెళ్ళి నా ట్రంకులో పెట్టెచూడు. టర్కిష్ తువ్వాలుంటుంది. ఇలా తే' అని స్నానాల గదిలోంచి వెంకటేశం కేక పెట్టేడు - స్నానాలగది పక్కనే 'అన్నయ్యకేం కావాలో' అని పరధ్యానంగా నిలబడిన శ్యామల ఆ తాళాలు గబుక్కుని అందిపుచ్చుకుని లోపలి గదిలోకి ఒక్క గంతు వేసింది. పెట్టె తెరిచేసరికి కామె కళ్ళు జిగేలుమన్నాయి. ఆశ్చర్యం, ఆరు సిల్కు జాకెట్టు గుడ్డలు!

'మూడు నెలలనుంచి పోరుతోంది, 'ఒరే అన్నాయ్, యీ పల్లెటూళ్ళో ఓ మంచి జాకెట్టు గుడ్డయినా దొరకదు. జాకెట్లు లేక నానా యిబ్బందీ పడుతున్నాను,-తేరా' అని- మరి యీ గుడ్డలు ఎవరికో ?- ఇంకెవరికీ, ఎంతలేసి వాళ్ళకైనా పెళ్ళాం బెల్లంముక్క- వదినగారికి తెచ్చేడు కాబోలు, మధ్య నేనెవర్నీ?' అనుకుంది శ్యామల.

'ఏమే, తువ్వాలు పట్టుకొస్తావని ఎంతకీ ఊడి పడవు ? ఇవతల తడిసి ముద్దయిపోతున్నాను.'

వెంకటేశం గావుకేకవిని శ్యామల యోచనా నిద్రనుంచి లేచింది. 'వస్తున్నానన్నాయ్' అని శ్యామల తువ్వాలు తీసుకెళ్ళి విసురుగా విస్సాటంగా వెంకటేశంమీద పడేసింది. వెంకటేశం బట్టలు మార్చుకొని యివతల కొచ్చేసరికి విశాలాక్షి బండీ దిగింది. వస్తూనే మొగుణ్ణి చూసి 'ఎప్పుడూ రావడాలు!' అంది. వెంకటేశం చిరునవ్వుతో 'తమరెప్పుడూ?'

'ఊళ్ళోనే పేరంటానికి వెళ్ళిన మేం ఎప్పుడో వస్తే ఏంగాని, మీరు ఎప్పుడొచ్చారేమిటి? మీచెల్లి కాఫీ యిచ్చారా ?'

'ఏదీ యిప్పుడేగా వస్తా, యిప్పుడే స్నానం చేసి బయటపడ్డాను. ఇక తమ స్వహస్తాలతో చేసిన కాఫీ పడాలి.'

విశాలాక్షి ముసిముసి నవ్వు నవ్వుతూ వంటింట్లోకి వెళ్ళింది.

'రాగానే చేతిలో పెడతాడా ఏమిటి? కాస్త స్థిమితపడ్డ తరువాత యిస్తాడేమో' అనుకుంది శ్యామల. ఇప్పుడు తనూ అన్నాయే. వదిన వంటింట్లో కాఫీ చేస్తోంది- యిస్తాడేమో? దిక్కుమాలిన ఆశ, పది నిముషాలయినా ఆ మనిషి నోరు కదపండే! తనే చివరకి తెగించి 'అన్నయ్యా, పట్నంనుంచి నాకేం తెచ్చావ్' అడిగేసింది. ఏదో ఆలోచిస్తున్న వెంకటేశం యిటు తిరిగి 'ఏం తేవాలమ్మా?' అన్నాడు చటుక్కున.

'ఏంతేవాలా? అంత మరుపైతే ఎలా అన్నాయ్. మూడు నెల్లనుంచి పోరుతున్నాను ఒక్క జాకెట్టుగుడ్డ తేరా అని, ఎందుకూ యీ సారి నిన్నడగను లే' శ్యామల మొహం అటు తిప్పేసుకుంది. 'అంత కోపమయితే ఎలాచెల్లీ, దేనికీ సొమ్ము సరిపోడం లేదు. ఈసారి తప్పకుండా తెస్తాగా' అన్నాడు వెంకటేశం. 'అవునవును. ఎందుకు సరిపోతుందీ, వదినకి సిల్కు బట్టలికి తప్ప'- అనుకుంది శ్యామల. ఇంతలో విశాలాక్షి అక్కడికొచ్చి 'ఇంత సేపు వేస్తేగాని దిక్కుమాలిన డికాక్షను దిగిందికాదు- తీరా చూద్దునూ పాలు విరిగిపోయి వున్నాయి, కాస్త మన శేషగారింటికి వెళ్ళి రెండు పాలు తీసుకొద్దురూ వదినా' అంది. శ్యామల గిన్నె పుచ్చుకొని చివాలున వెళ్ళిపోయింది. 'ఇంతసేపూ కూర్చోపెట్టి యిదా శుభవర్తమానం! భేష్' అన్నాడు వెంకటేశం నవ్వుతూ — 'మరేం చెయ్యనూ!' అని విశాలాక్షి గడపమీద కూర్చొంది.

'ఊరికే కూర్చోపోతే నా పెట్టి కాస్త సర్దకూడదూ, చిందర వందరగా వుంది? ఇవిగో తాళాలు' అన్నాడు వెంకటేశం. ఆ తాళాలు అందిపుచ్చుకొని విశాలాక్షి గదిలోకి వెళ్ళి పెట్టె తీసేసరికి కళ్ళు జిగేలుమన్నాయి - ఆరు, రంగు రంగుల సిల్కు పువ్వుల గుడ్డలు! విశా

లాక్షి! ఆలోచన పరిపరివిధాల పోయింది. ముక్కు మీద వేలేసుకొని 'ఆశ్చర్యం, యీాయన ఎంతకేనా తగును - ఎంత చెడ్డా యీ మనిషి ఆయనికి యీ జన్మకుల్లా తప్పదని జ్ఞానంలేదు కాబోలు - అయినా నేను పైనుంచి వచ్చి చేరిన దాన్ని కాని, వారూ వారూ ఒకటే - నా కెందుకు తెస్తారూ?' అనుకుంది. అవతల పాలు తెచ్చిన శ్యామల 'వదిన గదిలో దూరింది. అన్నయ్య జాకెట్టు గుడ్డలు తీసుకోమన్నాడు కాబోలు - ఛీ, నా కర్మం కాలి, మా అన్నయ్య అనుకుని పీడిని నోరువిడిని అడిగేను - పెళ్ళాం వలలో చిక్కాక అన్నయ్యేమిటి, తమ్ముడేమిటి?' అనుకుంది.

విశాలాక్షి యివతలకొచ్చి తాళాలం దభీమని వెంకటేశంమీద పడేసి, శ్యామల చేతిలో గ్లాసు విసురుగా లాక్కొని తన కోపమంతా నేలమీద చూపించింది. కాఫీ చేస్తూ విశాలాక్షి 'ఈ శ్యామల నక్కలా అక్కడ కాచుకు కూర్చొనే ఉంది, ఎప్పుడు వీలు కలుగుతుందా అని! ఈ సరికి ఆ అన్నగారు చేతిలో పెట్టే ఉంటాడు మధ్య భ్రమగాని నే నెవ తెసి?' అనుకుంది. వెంకటేశం మాత్రం నిశ్చింతగా కాఫీ తాగి 'మా స్నేహితుణ్ని చూసిరావాలి' అని వీధిలోకి వెళ్ళిపోయాడు. అరగంట గడచింది, వదినగారి మరదలుగారి మాట్లాడలేదు - రోజూ వదినా మరదళ్ళ హాస్యాలతో కిలకిలలాడే ఆ యింట్లో ఆవాళ గాజుల గలగలలేనా వినిపించలేదు - ఓ గంటన్నర గడిచిన తరువాత యిక విశాలాక్షి నోరు ఊండబట్టిందికాదు.

'ఆయనగారికి ప్రేమకొద్దీ యిచ్చారనుకో, నేను కాదనను-పోనీ తోటి ఆడదాన్నికదా నా చేతిలో ఓ జాకెట్టుగుడ్డ పెడితే (నాకఖర్లేదనుకో) నీ సిరేం తీసిపోయిందమ్మా?' అసలే ఓ జాకెట్టు గుడ్డయినా సొంత చెల్లికి చేతిలో పెట్టక అన్నీ ఆవిడగారికి సమర్పించాడని కోపంతో, ఉక్రోషంతో శ్యామల మండి పోతోంది. పైగా ఏమీ ఎరగని నంగనాచిలా యీ మాటలు చూస్తే శ్యామల దేహమంతా కరిగి, కరిగి ద్రవరూపం దాల్చింది-అంతా చేతులు బార జాపి 'ఆయనకాడికి అన్ని గుడ్డలూ లాక్కొని ఏమీ ఎరగనట్టు ఏం కబుర్లొదినా, ఎంతకేనా తగును... యింతకీ దిక్కులేని దాన్ని నేను స్వతంత్రంగా బ్రతక్క అన్నయ్యనీ తమ్ముడినీ వెర్రిభమలు పడి ఒహారి కొంప చేరడ మేమిటి? పోనీ చేశేనమ్మా తిన్నగా పడుండక జాకెట్లనీ, రవికలనీ ఎగబడ్డ మేమిటి? వదినా, నాదే తప్పు, యిదిగో చెంపలు వాయించుకుంటున్నాను...' క్రింద పడిన నీరు పారకుండా ఉంటుందా?... శ్యామల భోరున ఏడ్చేసింది. విశాలాక్షికి యీ మాటలు మరీ బాధించాయి.

'వెనకటికి మీలాంటిదే మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కిందట - అన్నయ్యను కల్లబొల్లి మాటలతో ఉబ్బించి అన్ని గుడ్డలూ స్వాధీనం పరచుకొని, మీసిగ్గు తరగ ఇలా ఉన్నారుగాని మీకొచ్చిన ఏట్లు ఎవరికొచ్చాయమ్మా?' అని దీర్ఘాలు తీసింది.

ఈ మంచి రసపట్టులో అసలు కలహకారకుడు వెంకటేశం చిరునవ్వుతో ప్రవేశించాడు. రాగానే విశాలాక్షి గబగబా వచ్చి 'చూశారా! మీచెల్లి, అన్ని జాకెట్టుగుడ్డలూ స్వాధీనపరుచుకొని...'

వెంకటేశం ఏమీ అర్థంగాక. 'ఆదేమిటి? శ్యామల జాకెట్టుగుడ్డలు తీసుకోడమేమిటి?' అన్నాడు. బస్తాకానుకొని కూర్చున్న శ్యామల గబగబావచ్చి 'అలాగడ్డిపెట్టు అన్నాయ్. జాకెట్టుగుడ్డలు నువ్వు వదినకే యిచ్చావ్, అవునా? అని అడిగింది.

'లేదే!' అన్నాడు వెంకటేశం - శ్యామల మొహం నల్లబడింది-మరి ఎవరికిచ్చినట్లు? అంది.

'ఎవరికియ్యడానికీ నాకేం హక్కుంది, ఆ జాకెట్టుగుడ్డలు నావి కానేకావు - అక్కడ నాతో పనిచేస్తున్న మాస్నేహితుడొకడు 'మీ రెలాగా అవ్వూరు వెడుతున్నారు గనుక యీ గుడ్డలు శ్రమనుకోక మాఆడవాళ్ళకియ్యాండి, అని యిచ్చాడు-నేనిప్పుడే ఆ యిల్లు అతి ప్రయాసతో కనుక్కొని యిచ్చి వచ్చాను-ఈ మాత్రం దానికి కొట్టుకు చచ్చారా? మిమ్మల్ని యిద్దర్నీ యీ క్షణం వార్ ట్రైనింగు పంపాలి' అన్నాడు నవ్వుతూ - క్షణంక్రిందట ఆ యింట్లో ఏడుపులూ రాగాలూ, యిప్పుడు హాస్యాలూ, నవ్వులూ.